

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు



సంపుటి : 10 సంచిక : 13 పుష్పం : 27-28 20-03-2005

రమణ భాస్కర
ఆధ్యాత్మిక పక్ష పత్రిక
పేజీలు : 16
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥100/-
విడి ప్రతి : రు॥ 8/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

28-12-04
జిన్నూరు .................. 1

08-01-05
కొమరగిరిపట్నం ....... 9

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-12-04, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈరోజు శ్రీరమణజయంతి. రమణజయంతి మీకు వెలుగు, నాకు వెలుగు, ఈ భూమికి వెలుగు. ఉప్పులేని పప్పు ఎలా ఉంటుందో జ్ఞానులు లేని సమాజం కూడా అలాగ ఉంటుంది అని ఒక మహాత్ముడు చెప్పాడు. మహాత్ముల, మహర్షుల జన్మ దినాలు, జయంతులు జరుపుకోవటం వలన ప్రయోజనం ఏమిటి అంటే వారి మాటలను మననం చేసుకోవటానికి, వారి జీవితాన్ని మననం చేసుకోవటానికి ఇదొక అవకాశం. రమణస్వామి తిరుచ్చుళి గ్రామంలో జన్మించారు, ఆయనకు మధురాయి పట్నంలో జ్ఞానోదయం అయ్యింది. ఆయన 1896 సం॥ సెప్టెంబరు 1వ తేదీన అరుణాచలం వచ్చారు. ఈశ్వరుడి పట్ల ఆయనకు ఎప్పుడు జనకభావన ఉండేది. ఆయనకు బాహ్యగురువు లేకపోయినప్పటికీ అరుణాచలేశ్వరుడే ఆయనకు గురువు. ఆయన 54 సం॥లు అరుణాచలంలో ఉన్నారు. మనం అదృష్టం వచ్చినప్పుడు ఒక రకంగా ఉంటాము, దురదృష్టం వచ్చినప్పుడు ఒక రకంగా ఉంటాము. చేతినిండా డబ్బు ఉన్నప్పుడు ఒకరకంగా ఉంటాము, చేతిలో డబ్బు లేనప్పుడు ఒకరకంగా ఉంటాము. రమణ స్వామి అరుణాచలం వచ్చిన రోజున ఆయన దగ్గర ఉన్నవి అన్నీ గుడిదగ్గర ఉన్న చెరువులో పడేసి కౌపీనం ధరించారు. ఆయన శరీరం విడిచిపెట్టే వరకు కౌపీనంతోనే ఉన్నారు. మాకు దండలు అక్కరలేదు, గౌరవానికి ఇవ్వాలనుకొంటే ఒకబొకే యిస్తే సరిపోతుంది అని చెపుతూ ఉంటాను. ఎందుచేతనంటే లాంఛనాలు సాధ్యమయినంత వరకు తగ్గించుకోవటం మంచిది, లాంఛనాలు పెరిగే కొలది దేహబుద్ధి పెరుగుతుంది అంటే మనం ఏదైతే తగ్గించుకోవాలి అనుకొంటున్నామో అది పెరిగిపోతుంది.

రమణస్వామికి ఐశ్వర్యం వచ్చింది, అన్నీ వచ్చాయి కాని ఆయన గోచీ విడిచిపెట్టలేదు. ఇక్కడ మనం గ్రహించవలసింది ఏమిటి అంటే జ్ఞానం ప్రధానం. మనలో అశాంతి ఉన్నప్పుడు, వెలితి ఉన్నప్పుడు దానిని కప్పిపుచ్చుకోవటానికి బాహ్యమైన గౌరవాలకు, ఆడంబరాలకు సిద్ధమవుతాము, అది అజ్ఞానానికి గుర్తు.

చాలామంది స్త్రీలు వస్తున్నారు, మీరు గోచీ పెట్టుకొని కూర్చొంటున్నారు, కొంచెం తుండు గుడ్డ అయినా కట్టుకోవచ్చు కదా అని ఒక భక్తురాలు భగవాన్‌తో అంది. అమ్మా! నువ్వు ఏ దృష్టితో ఇక్కడకు వచ్చావో ఆ దృష్టితో చూసి వెళ్ళు. నువ్వు జ్ఞానాన్ని చూడటానికి ఇక్కడకు వచ్చావు అది చూసి వెళ్ళిపో అంతే గాని మిగిలిన గొడవలు వద్దు. నువ్వు తుండు కట్టుకోమని చెపుతున్నావు, ఇంకొకరు వచ్చిపంచె కట్టుకోమంటారు, ఇంకొకరు వచ్చి ప్యాంటు వేసుకోమంటారు, ఇంకొకరు వచ్చి షర్టు వేసుకోమంటారు. ఇందులో ఎవరి మాట నేను వినాలి అన్నారు. పరాయిబుద్ధి ఎప్పటికయినా ప్రమాదం. ఇది మీరు బాగా గుర్తుపెట్టుకోండి. ఎప్పటికయినా సొంతబుద్ధి మనలను సుఖపెడుతుంది కాని ఎన్నడూ పరాయిబుద్ధి మనలను సుఖపెట్టదు. మనకు జీవితంలో అదృష్టం వస్తుంది, దురదృష్టం వస్తుంది. ఈ అదృష్టం, దురదృష్టం కూడా మనస్సుకే, లోపలఉన్న చైతన్యానికి వీటితో సంబంధం లేదు. అదృష్టం వచ్చినప్పుడు మనం సంతోషిస్తాము, దురదృష్టం వచ్చినప్పుడు కుంగిపోతాము, వీటివలన మనస్సు పెరిగిపోతుంది. ఏది మనం తొలగించుకోవాలో అది బలపడిపోతుంది, ఇది మనం గుర్తుపెట్టుకోవాలి. వికారములు లేనివాడు యోగి అంటే నిర్వికారుడు యోగి. అదృష్టం వచ్చినప్పుడు పొంగిపోతూ ఉంటే, దురదృష్టం వచ్చినప్పుడు కుంగిపోతూ ఉంటే మన స్వరూపానికి మనం దూరమయిపోతాము. అదృష్టమూ మాయే, దురదృష్టమూ మాయే, అసలు మనస్సే మహా మాయ. ఇది మీరు గుర్తుపెట్టుకోవాలి. మన మనస్సు ఎంత నిజమో మన దేహమూ అంతే నిజం, మనకు కనిపిస్తున్న ఈ లోకం కూడా అంతే నిజం అని ముందు మనకు అర్థం అవ్వాలి. మనకు జాగ్రదవస్థలో లోకం కనిపిస్తోంది కాని సుషుప్తి అవస్థలో లోకం కనిపించటం లేదు. మనస్సు ఉన్నప్పుడు లోకం కనిపిస్తోంది, మనస్సు లేనప్పుడు లోకం కనిపించటం లేదు. మనస్సు ఎంత వాస్తవమో లోకం కూడా అంతే వాస్తవం. మనస్సును మినహాయిస్తే అక్కడ లోకం లేదు, పుణ్యం లేదు, పాపం లేదు, అదృష్టం లేదు, దురదృష్టం లేదు, పూర్వజన్మ లేదు, రాబోయేజన్మ లేదు, ఏదీలేదు. ఆ గడప దాటటమే మన సాధన యొక్క గమ్యం. ప్రణవం, ఓంకారం పురుషులే చేసుకోవాలా, స్త్రీలు చేసుకోకూడదా అని సుబ్బరామయ్యగారి తల్లి భగవాన్‌ను అడిగారు. అమ్మా నీకు కావలసింది ఆత్మజ్ఞానం, నువ్వు జ్ఞానసిద్ధిని పొందాలి, జ్ఞానసిద్ధిని పొందటానికి ప్రణవం ఉపయోగపడుతూ ఉంటే ప్రణవం చేసుకోవమ్మా, అభ్యంతరం ఏముంది.

నీవు ఏపని చేస్తున్నా అది జ్ఞానసిద్ధికి సహకరించాలి.

శరీరానికి లింగభేదం కాని ఆత్మకు లింగభేదం లేదు. మనగమ్యం ఆత్మజ్ఞానం పొందాలి, అది మనం మర్చిపోకూడదు. రమణాశ్రమంలో ఉదయం ఏడు గంటలకు ఇడ్లీ ఇస్తారు, కాఫీ ఇస్తారు. కొంతమంది తెల్లవారుఝామున గిరిప్రదక్షిణకు బయలుదేరి ఏడు గంటలకు ఆశ్రమానికి వెళ్ళిపోవాలి. లేకపోతే ఇడ్లీ టైము దాటిపోతుంది, టైము దాటిపోతే ఇడ్లీ ఇవ్వరు. కాఫీ ఇవ్వరు అనుకొంటూ టైము చూసుకొంటూ గిరిప్రదక్షిణ చేయటం. వారు అరుణాచలం స్మరణ వదిలేసారు, అరుణగిరి స్మరణ వదిలేసారు, కాఫీను స్మరించు కొంటూ రమణాశ్రమానికి టైముకి వచ్చేసారు. వారు ఇడ్లీ తిన్నతరువాత కాఫీ త్రాగిన తరువాత భగవాన్ పిలిచి ఏమయ్యా మీరు గిరిప్రదక్షిణ చేసేటప్పుడు అరుణాచలేశ్వరుడిని స్మరించారా లేక పొట్టకోసం కాఫీను స్మరించుకొంటూ తిరిగి వచ్చారా అని అడిగారు. మీరు ఎంతసేపు పొట్టను స్మరించుకొంటున్నారు, అరుణాచలేశ్వరుడిని స్మరించుకోవటం లేదు, ఇంక ప్రదక్షిణ వలన ప్రయోజనం ఏమిటి? ఏ తలంపు వచ్చినా కంగారు పడకండి. లోపల దేహము నేను అనే తలంపు ప్రతీ తలంపుకు ఆలంబనగా ఉంటుంది. మీ తలంపులకు అది సపోర్టుగా లేదు అనుకోండి. మీకు తలంపులు వచ్చినా మీకు దుఃఖం కలుగదు. జ్ఞానికి కూడా తలంపు వస్తుంది కాని జ్ఞానికి వచ్చే తలంపు ఆయనకు దుఃఖకారణం కాదు. మనకు వచ్చే తలంపులు మనకు దుఃఖకారణం ఎందుచేతనంటే మనకు వచ్చే తలంపులకి దేహము నేను అనే తలంపు కేంద్రంగా ఉంటుంది, దానిని కేంద్రంగా పెట్టుకొని వచ్చే అన్ని తలంపులు కూడా దుఃఖానికి కారణం, భూతకాలాన్ని మర్చిపో, భవిష్యత్ గురించి గాలిలో మేడలు కట్టవద్దు. వర్తమానకాలంలో సజీవంగా జీవించండి. ఈ జన్మే అసత్యమయినప్పుడు నీకు పూర్వజన్మల గొడవ ఎందుకు? తలంపులు పీడించేస్తున్నాయి అని కొంతమంది అంటారు. ఈ జన్మలో తలంపులే పడలేక పోతున్నావు రాబోయే జన్మలో తలంపుల గొడవ ఎందుకు? పూర్వజన్మ తలంపుల గొడవ ఎందుకు? ఈ జన్మ ఎంత అసత్యమో రాబోయే జన్మ కూడా అంతే అసత్యం, పూర్వజన్మకూడా అంతే అసత్యం. ఈ జన్మలో బాధలే నీవు పడలేనప్పుడు పూర్వ జన్మల బాధల గొడవ నీకు ఎందుకు, అజ్ఞానాన్ని పెంచుకోవటానికా. అసలు ఈ తలంపులు మనకు ఎందుకు ఎక్కువగా వస్తున్నాయి అంటే మనం భగవంతుడికి వేరుగా ఉన్నాము అని అనుకోవటం వలన, భగవంతుడిని కాదని మనం ఏదో సాధించగలము అని అను కోవటం వలన ఇది అంతా జరుగుతోంది. భగవంతుడిని కాదని మనం ఏమీ చేయలేము. కాని ఏదో చేయగలము, సాధించగలము అనే బుద్ధి మనకు ఉంది. అక్కడ నుండే తలంపులు ఎక్కువగా వస్తున్నాయి, అవే మనలను బంధిస్తున్నాయి. భగవంతుడిని కాదని మనం ఏమీ

చేయలేము, ఉన్నది ఆయన ఒక్కడే, మనం అందరం నీడలం మాత్రమే.

1912వ సం॥లో భగవాన్ విరూపాక్ష గుహలో ఉండగా ఆయన పుట్టినరోజును తెలుసుకొని కొంతమంది వారి ఇంటి దగ్గర పాయసం, స్వీట్లు వండుకొని తీసుకొనివచ్చారు. ఈ తినుబండారాలు అన్నీ తీసుకొని వచ్చారు ఏమిటి అని భగవాన్ అడిగితే ఇవాళ మీ పుట్టినరోజు కదండీ అందుకే తెచ్చాము అని చెప్పారు. ఈ శవం పుట్టినరోజు పుట్టినరోజు అనుకొంటున్నారా? ఈ దేహం పుట్టిన రోజున ఏ మనిషీ పుట్టలేదు. దేహము నేను అనే తలంపు ఎప్పుడు అయితే వచ్చిందో అప్పుడు నీవు పుట్టావు. అది పుట్టినరోజు కాని ఈ శవం పుట్టినరోజున నువ్వు పుట్టలేదు. దేహంతో తాదాత్మ్యం పొందేబుద్ధి ఎప్పుడైతే నీకు కలిగిందో అప్పుడు నీవు పుట్టావు. దేహం చనిపోయినప్పుడు నీవు చావవు. దేహంతో తాదాత్మ్యం పొందే బుద్ధి ఎప్పుడైతే నశించిందో అప్పుడు నీవు చనిపోతావు. అదే నిజమైన చావు. అంతవరకూ ఈ చావులు, పుట్టుకలు రెండూ అసత్యమే అని చెప్పారు. మా ఇంటి దగ్గర నుండి తెచ్చుకొని ఇక్కడ తిని వెళ్ళిపోతే మీకు అభ్యంతరం ఏమిటి అన్నారు ఆ భక్తులు. మనం ఎలా చెప్పినా వీరు వినటం లేదు అని అప్పుడు సరిసరి అన్నారు భగవాన్. అది అలా జరగవలసి ఉంటే జరుగుతుంది అనే ఉద్దేశ్యం మీద అది సరి అంటారు. అలాగ 1912 వ సం॥లో ఆయన విరూపాక్ష గుహలో ఉండగా ఆయన పుట్టినరోజు జరిగింది. గురువుతో ఉన్న సంబంధం గురువు యొక్క శరీరం పతనమయిన తరువాత కూడా అనుబంధం కంటిన్యూ అవుతుందా అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. గురువు ఆ శరీరం అయితే అనుబంధం కంటిన్యూ అవ్వదు కాని గురువు శరీరం కాదు కదా, గురువు అంటే ఆత్మ, గురువు అంటే చైతన్యం అన్నారు. శరీరం ఉంటే ఉండి, శరీరం లేకపోతే వాడు ఉండడు అనుకొంటే వాడు గురువే కాదు. గురువు అంటే ఆత్మే కాబట్టి ఆత్మకు మరణం లేదు కాబట్టి గురువు యొక్క శరీరం పోయినా అనుబంధం అలా కంటిన్యూ అవుతూనే ఉంటుంది. అది మాటకు అందదు, ఇంద్రియాలకు అందదు, మనస్సుకు అందదు.

గురువు ఏ స్థితిలో ఉన్నాడో, ఏ ఆనందాన్ని అనుభవిస్తున్నాడో ఆ స్థితికి భక్తుడిని తీసుకొని వచ్చే వరకు గురువు వాడిని విడిచిపెట్టడు. గురువు అనుగ్రహంలో పడినవాడు ఏనాటికయినా తరించబడతాడు కాని గురువు వాడిని విడిచిపెట్టే సమస్యలేదు. రమణ భగవాన్ మా హృదయంలో ప్రవేశించాక ఆయన పట్ల మేము ఎటువంటి ఆప్యాయత, గౌరవం తోటి ఉన్నామో ఈనాటి వరకు అటువంటి గౌరవంతోటే ఉన్నాము, ఇందులో మా తెలివి తేటలతో సంబంధం లేదు, అది జన్మాంతర అనుబంధం. మేము ఆయనను పట్టుకోలేదు ఆయనే మమ్మల్ని పట్టుకొన్నాడు కాబట్టి అలా యూనిఫారమ్‌గా పడి ఉన్నాము, దానికి కారణం

కేవలం ఈ జన్మలో చేసిన కృషికాదు, అది జన్మాంతర అనుబంధం. భగవాన్ జ్ఞానేకాదు, ఆయన గురువు కూడా కాదు అని కొంతమంది అంటారు అనుకోండి మా మనస్సు ఏమీ చలించదు దానికి కారణం అది జన్మాంతర అనుబంధం. బాహ్యంగా చూస్తే భగవాన్ పని చేసారు, మనమూ పని చేస్తున్నాము కాని ఇక్కడ ఒక రహస్యం ఉంది గుర్తు పెట్టుకోండి. మనం పని చెయ్యటానికి ప్రేరణ అహంకారం, జ్ఞాని పనిచెయ్యటానికి అక్కడ ప్రేరణ అహంకారం కాదు, జ్ఞాని శరీరం ఈశ్వరుని చేతిలో పనిముట్టు కింద ఉంటుంది. మేము ఏమీ పని చెయ్యము అని కొంతమంది అంటూ ఉంటారు, వాడికి అహంకారం ఉంటే పనిచెయ్యకుండా ఎలా ఉంటాడు. వాడి అహంకారం, వాడి స్వభావం, వాడి మమకారం వాడిచేత పనిచేయించి తీరుతుంది, మరల కొత్త శవాలను తీసుకొని వస్తుంది. జ్ఞానికి దేహాత్మ బుద్ధి ఉండదు కాబట్టి నేను చేస్తున్నాను అనే తలంపు అక్కడ ఉండదు అందుచేత వాడు ఏది చేసినా అది వాడిని బంధించదు. అర్జునా నువ్వు పొందవలసింది పొంది ఈ మూడు లోకాలను భస్మం చేసినా అది నిన్ను బంధించదు అని పరమాత్మ చెప్పాడు. అది మనం చదువుతున్నాము కాని మనకు అర్థంకావటం లేదు. అంటే దేహభావన లేనివాడు, దేహాత్మ బుద్ధి లేనివాడు ఏది చేసినా చెయ్యనివాడితో సమానము, వాడు చేసిన కర్మ అంతా అకర్మ అయి కూర్చుంటుంది. ఏదో రమణమహర్షిగారు అలా చేసారు, మేము అలాగే చేస్తాము అని ఇలా అనుకోవద్దు. ఏది ఎప్పుడు ఎలా జరగాలో అది అప్పుడు అలా జరిగిపోతూ ఉంటుంది అని మనం నిశ్చింతగా, నిర్మలంగా ఉండగలుగుతున్నామా? ఉండలేకపోతున్నాము. దానికి కారణం ఏమిటి అంటే మన వ్యక్తిభావన అలా ఉండనివ్వదు.

మనం భగవద్గీత చదువుతున్నాము అనుకోండి, అది అర్థంకాకపోయినా పుణ్యం వస్తుంది, చదివినందుకు కొన్ని మార్కులు వేస్తారు, చదివి అర్థం చేసుకొంటున్నాము అనుకోండి దానికి కొన్ని మార్కులు వేస్తారు, చదివి అర్థం చేసుకొని ఆచరిస్తున్నాము అనుకోండి దానికి కొన్ని మార్కులు వేస్తారు. ఆచరించినది అనుభవంలోనికి తెచ్చుకొన్నాము అనుకోండి అప్పుడు మోక్షం కలుగుతుంది. కొంతమందికి లోపల ఒకటి ఉంటుంది, నోటితో ఒకటి చెపుతారు, అటువంటి వారికి రంపం పెట్టి కోసినా ఆత్మజ్ఞానం రాదు. మనం నోటితో చెప్పే మాటల వలన భగవంతుడు మోసపోడు, మనం నోటితో చెప్పేది మన గుండెలో కూడా ఉందో లేదో భగవంతుడు చూసుకొంటాడు. మనకు నేను అనే భావన ఉంది కదా, ఆ భావన ఎక్కడ నుండి ఉదయించి వస్తోందో, ఆ మూలంలోనికి వెళ్ళి అది అక్కడ స్థిరపడే వరకు మిమ్మల్ని అశాంతి విడిచిపెట్టదు, దుఃఖం విడిచిపెట్టదు, కర్మ మిమ్మల్ని విడిచిపెట్టదు, ఇవి అన్నీ మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటాయి, ఇది బాగా గుర్తు పెట్టుకోండి. మీరు మంచి పనులు చేస్తారు, పుణ్యం వస్తుంది,

అనుభవిస్తారు. కాలప్రవాహంలో అన్నీ కొట్టుకొనిపోతాయి. ఇప్పుడు మనం ఆరోగ్యంగా ఉన్నాము అనుకోండి, ఎప్పుడూ ఇలాగే ఉంటాము అనిపిస్తుంది. మన కళ్లతోటి అనేకమంది చనిపోవటం చూస్తున్నాము కాని మనకేమీ ఇబ్బంది లేదు అనుకొంటాము. మాయ అంతా ఇక్కడే ఉంది. మనకు ధనం ఉంది అనుకోండి ఎప్పుడూ ఇలాగే ఉంటాము అనుకొంటాము కాని ఆ ధనం ఎప్పుడు పోతుందో చెప్పలేము, విధి చాలా బలీయమైనది, ప్రకృతి విజృంభిస్తే ఏముంది? ఈ మధ్య సముద్రం పొంగింది. వేలాది మంది చనిపోయారు, మన సైన్స్ ఏమి చేసింది. ప్రకృతి మనకు సహకరిస్తోంది కాబట్టి గంతులు వేస్తున్నాము. ప్రకృతి ఒకసారి విజృంభించింది అనుకోండి మనం అందరం పోతాము. మీరు ఇంటికి వెళ్లి ప్రశాంతంగా కూర్చొని ఆలోచించుకోండి. మన అందరికి తెగులు ఎక్కడ ఉంది అంటే మనస్సు లేకపోతే మనం ఉండమేమోననే భయం మన అందరికి ఉంది. మనస్సు లేకుండా మనం ఉంటాము కాని ఉండము అనే భావన వలన దానిని తొలగించుకోవటానికి నిజంగా ప్రయత్నం చేయటం లేదు, ప్రయత్నం చేస్తున్నట్లు నటిస్తున్నాము అంతే. దీనికే భగవాన్ ఏమని చెప్పారు అంటే అందరూ గజ ఈతగాళ్లే. ఎవడూ గజం కదలటంలేదు అన్నారు. అందరూ గంటలు తరబడి సాధన చేస్తున్నారు. మీరు చేసే సాధన నిజమైతే ఒక్క అంగుళం అయినా నీవు లోపలికి దిగాలి కదా. నువ్వు లోపలకు వెళ్ల లేదు అంటే నీ మనస్సు సాధన చేస్తున్నట్లు నటిస్తోంది కాని నిజంగా చేయటం లేదు అని దీనిని బట్టి నీకు అర్థమవుతోంది కదా.

మామూలుగా రోజూ శరీరం ముఖం కడుక్కొంటోంది, స్నానం చేస్తోంది, దీనికి మనస్సును ఏమీ ఉపయోగించటం లేదు. మనస్సుతో సంబంధం లేకుండా మన దేహం కొన్ని పనులు చేసుకొని వెళ్లిపోతుంది. మనస్సు లేకుండా మనం ఉంటాము, పనులు కూడా అయిపోతాయి. మనస్సు లేకుండా మనం చేసే పని వలన పనులు అయిపోతాయి, టెన్షన్ ఉండదు, ఆ పని మనలను బంధించదు. కర్తురాజ్ఞయాప్రాప్యతే ఫలం అన్న శ్లోకం మీద మనకు విశ్వాసం ఉంటే, మనస్సు నశిస్తుంది, మనం ఏదో పని చేస్తాము, ఫలితం కోసం ఎదురుచూస్తాము, మనకు ఈశ్వరుడి మీద విశ్వాసం ఉంటే ఆయన ఆజ్ఞ ప్రకారం అంతా జరుగుతుంది అనే భావన మీకు ఉంటే ఇంక ఎదురుచూడటం ఎందుకు? దేహము నేను అనే తలంపు మీద మిగతా తలంపులు ఆధారపడి ఉన్నాయి. అందుచేత దేహము నేను అనే తలంపు ఎక్కడయితే పుట్టిందో ఆ పుట్టిన చోటుకు వెళ్లి అక్కడ ఉంటే దేహము నేను అనే తలంపు నశిస్తుంది. అది నశించినప్పుడు నీవు నశించవు, నువ్వు ఎవడిగా ఉన్నావో అది నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది, అదే జ్ఞానం, అదే సత్యం, అదే మోక్షం. అయితే అక్కడ నిలబడలేక చాలామంది ఆమార్గం నుండి తప్పకొంటున్నారు. అది మీకు

అవగాహన అవ్వాలి, దానికి సహనం అవసరం. భగవాన్ దగ్గర ఇద్దరు కూర్చున్నారు. అందులో ఒకడు ఏమన్నాడు అంటే వాడి మనస్సులో ఏముందో నాకు తెలుస్తోంది అన్నాడు. దానిని బట్టి తెలుస్తోంది కదా వాడూ నువ్వూ ఒక్కటే అని. వాడూ నువ్వూ ఒకటి కాకపోతే వాడి మనస్సులో ఉన్నది నీకెలా తెలుస్తుంది, దీనిని బట్టి వాడూ నువ్వూ ఒక్కటే అని అర్థమవుతోంది కదా అన్నారు, మోస్టు నేచురల్ టీచింగ్.

మీ దేహానికి అన్ని కంఫర్టులు ఉన్నాయి, మీకు కొరత అంటూ ఏమీ లేదు కాని మీకు దుఃఖం వచ్చేస్తోంది అనుకోండి, వీటి వలన ప్రయోజనం ఏమిటి అంటున్నారు భగవాన్. అహంభావన ఉంటే పుణ్యం ఉంది, పాపం ఉంది, స్వర్గం ఉంది, నరకం ఉంది, దేవుడు ఉన్నాడు అన్నీ ఉన్నాయి, అందులో నుండి నీవు విడుదల అయ్యావా ఏమీ లేదు, నువ్వు మిగులుతావు. నువ్వు పోవు, నీవు ఏదిగా ఉన్నావో అలా ఉంటావు. ఎవరు వచ్చినా నిన్ను నీవు తెలుసుకో, నిన్ను నీవు తెలుసుకో అంటున్నారు, ఎవరిని తెలుసుకోమని అని ఒక ప్లీడరుగారు భగవాన్‌ను అడిగారు. నువ్వు ఎవడిగా ఉన్నావో వాడిని తెలుసుకో అన్నారు భగవాన్. ఈ గౌరవాలు, అగౌరవాలు, చావులు, పుట్టుకలు, లాభాలు, నష్టాలు, దారిద్ర్యాలు, ఐశ్వర్యాలు అన్నీ మనస్సుకే. అది నీవు నోటితో చెపితే కాదు ముందు నీకు అర్థమవ్వాలి, అది నీ గుండెకు పట్టాలి. ప్రతీ మానవశరీరం కూడా తీసిన సినిమాలాంటిది. అందుకే దేహాన్ని ప్రారబ్ధానికి వదిలెయ్యి అని భగవాన్ స్పష్టంగా చెప్పారు. దేహాన్ని ప్రారబ్ధానికి వదిలేసి నువ్వు వచ్చిన పని చూసుకో అని చెప్పేవారు. గురువు యొక్క దయ, గురువు యొక్క శక్తి మన మనస్సుకు అందదు, అది పొందిన తరువాత ఇది కదా గురువు దయ అంటే అని మనకు తెలుస్తుంది. నువ్వు బండెడు పుస్తకాలు చదవటం కంటే, నీవు చేసే సాధనల కంటే గురువు యొక్క దయ లిప్త మాత్రం చాలు. సర్వసాధారణంగా మనం గురువుల దగ్గరకు వెళితే నువ్వు ప్రాణాయామం చేసుకో, తెల్లవారుఝామున 4 గంటలకు లేచి జపం చేసుకో, ధ్యానం చేసుకో, అలా చెయ్యి, ఇలా చెయ్యి అని లిస్టు కింద తొంభై చెప్పేస్తారు. భగవాన్ ఇటువంటి మాటలు చెప్పరు, వాళ్ళ ఇంటిదగ్గర బాధలు వాళ్ళు పడలేకపోతూ ఉంటే, మరల అదనంగా వాళ్ళకు నేను బాధలు చెప్పటం ఏమిటి అనేవారు, పైకి అలాచెపుతూనే లోపల వారికి ఆత్మాన్వేషణ చేయాలనే బుద్ధిని కలుగజేసేవారు. నేను మిమ్మల్ని స్మరిస్తున్నాను, అలా స్మరించుకొంటే సరిపోదు కదా, మీవైపు నుండి కూడా ప్రతిస్పందన రావాలికదా, మీరు కూడా నన్ను స్మరించుకోవాలి కదా అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నాడు. భగవాన్‌ను స్మరించుకొంటున్నాను అని నీవు అనుకొంటున్నావు. అసలు నీవు స్మరించుకోవటం కూడా ఆయన ప్రేరణ వలననే, ఆయన దయ వలననే ఆయనను స్మరించుకొంటున్నావు. అసలు

నువ్వు ఎక్కడ ఉన్నావు. మన అహంకారం భగవాన్‌ను తలపెట్టుకొంటుందా. మనం అనాత్మను స్మరిస్తున్నప్పుడు, అనాత్మలో జీవిస్తున్నప్పుడు ఆత్మలోనికి మళ్ళించటానికే ఆత్మ మనలను స్మరిస్తుంది, ఆత్మ మనలను స్మరించాకే మనకు ఆత్మ గుర్తుకు వస్తుంది. నేను స్మరిస్తున్నాను అని నీవు అనుకొంటున్నావు కాని ఆ ప్రయత్నం కూడా నీ సొంతం కాదు, అది కూడా ఆత్మదయే. భగవాన్ అనుగ్రహం లేని క్షణం అంటూ లేదు. భగవాన్ అనుగ్రహంలో ఉన్నప్పుడు నీకు ఎప్పుడయినా అశాంతి వచ్చినా, నీకు అశాంతి కలుగజేయాలనికాదు, శాంతి యొక్క విలువ నీకు తెలియజేయటానికే అలా చేస్తున్నారు. కొంతమంది అన్నీ సహిస్తారు, అన్నీ సహిస్తున్నాము అనే సంగతి కూడా వాళ్ళకు తెలియదు, వారు ఆత్మజ్ఞానానికి వారసులవుతారు.

భగవాన్ మనలను మరచిపోయారు, మన చెయ్యి వదిలేసారేమో అని ఒకోసారి మనకు అనిపిస్తుంది. భగవాన్ మనకు దూరమయిపోయారు అనే తలంపు కూడా ఎందుకు వస్తోంది అంటే ఆయన హృదయంలోనికి మనలను తీసుకోవటానికే అలా చేస్తున్నాడు, అది కూడా ఆయన దయే. ఏదో చెయ్యాలి, ఏదో తెలుసుకోవాలి అని నీవు అనుకొంటున్నావు. ఏదో చేయాలి, తెలుసుకోవాలి అనే బుద్ధిని కలుగజేసినవాడు కూడా గురువే. నీకు సాధన చేయాలనే బుద్ధిని కలుగజేసేవాడు, నీచేత సాధన చేయించేవాడు, ఆ వస్తువును పొందింపచేసేవాడు గురువే. మనం ఈశ్వరుడికంటే భిన్నంగాలేము, భిన్నంగా ఉన్నాము అనే తలంపులో నుండే సంసారం ప్రారంభమవుతోంది, అశాంతి ప్రారంభమవుతోంది, దుఃఖం ప్రారంభమవుతోంది. అన్ని తలంపులకు ఆశ్రయం ఇచ్చేది, వాటిని పెంచి పోషించేది దేహము నేను అనే తలంపు, ఇది ఆశ్రయం ఇవ్వకపోతే ఏమీలేదు, ఏదైతే ఆశ్రయం ఇస్తోందో దానిని ఊడగొట్టండి, దానిని ఊడగొట్టారు అనుకోండి అప్పుడు మీకు ఏదైనా తలంపులు వచ్చినా ఇబ్బంది లేదు, అవి మిమ్మల్ని బంధించవు, పునర్జన్మ హేతువులు కావు. లోపల ఉన్న శాంతి సాగరం తాలూక ఒక తుంపర కనుక నువ్వు రుచి చూడగలిగితే అందులో నుండి జారిపోయినా మరల ఆ స్థితని ఎప్పుడు పొందుతాము అని మనకు అనిపిస్తూ ఉంటుంది, ఒకసారి పొంది ఉన్నావు కాబట్టి మరల దానిని పొందాలి అనే ఆరాటం, పోరాటం, ఆకాంక్ష లోపల నుండి ఉబికి ఉబికి వస్తూ ఉంటుంది. నీకు సంసార గొడవలు, వ్యాపకాలు, పదవులు, ఎంజాయ్‌మెంట్స్ ఎన్నో ఉండవచ్చు. నీ జీవితంలో లోపల ఉన్న సుఖాన్ని ఒక్క క్షణం అనుభవించి ఉంటే, ఈ సంసార గొడవలను, ఎంజాయ్‌మెంట్స్‌ను వదిలేసి నీ మనస్సు అటులాగేస్తూ ఉంటుంది. లోపల ఉన్న సుఖంతోటి చూస్తే ఇప్పుడు నీవు అనుభవించే సుఖాలన్నీ ఏపాటివి. ఇవి అన్నీ చప్పగా ఉంటాయి. అట్టిది ఆ సుఖం, ఒకవేళ మీరు భోగాల మధ్యన ఉన్న ఇవి అన్నీ రుచిహీనమయినవి, సారహీనమయినవి అని నీకు తెలుస్తుంది.

లోపల ఉన్న ఆనందం అనుభవించేటప్పుడు నీ శరీరం మరణించినా నీకు ఏమీ అనిపించదు, ఆ పోయేది నీవు కాదు అని నీకు స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది, అప్పుడు ఏదో పోగొట్టుకొంటున్నాము అని నీకు అనిపించదు. శాస్త్రపండితులకీ, ఆత్మజ్ఞానులకు మధ్యన తేడా ఎలా ఉంటుంది అంటే మనం కాఫీ తాగుతున్నాము అనుకోండి, కాఫీపైన నురుగు ఉంటుంది. శాస్త్రపండితుల మాటలు ఆ నురుగులాంటివి. ఆ నురుగును గెంటుకొని లోపల ఉన్న కాఫీని నోట్లో పెట్టుకొంటే ఎలాగ ఉంటుందో జ్ఞాని మాటలు అలా ఉంటాయి.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 08-01-05, కొమరగిరిపట్నం)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఇప్పుడు మనం అందరం ప్రహ్లాదస్వామి వారి ఆశ్రమానికి వచ్చాము. సముద్రంలో ఉన్న ఓడలకు లైట్‌హౌస్ ఎలా ఉపయోగ పడుతుందో అలాగే జీవకోటికి ఈ ఆశ్రమాలు ఉపయోగపడతాయి. ప్రతీ ప్రాంతంలో నదులు, కాలువలు ఎంత అవసరమో ఆశ్రమాలు కూడా అంతే అవసరం. ఆశ్రమవాతావరణంలోకి వచ్చేటప్పటికి మనకు ఆనందం కలుగుతుంది, శాంతి కలుగుతుంది. మనం ఏదైతే నేను నేను అంటున్నామో అది అసత్యమైననేను. అసత్యమైననేనుకు దేహంతో తాదాత్మ్యం ఉంటుంది, ఒక జాతితోటి, ఒక కులంతోటి, ఒక నామంతోటి, ఒక రూపంతోటి తాదాత్మ్యం ఉంటుంది. మనకు నేను అనేటప్పటికి దేహం స్ఫురిస్తుంది. దేహగతమైన నేనుకు నామం, రూపం, పరిసరాలు, మమకారం, కోపం, ఉద్రేకం అన్నీ ఉంటాయి. ఈ దేహగతమైననేనును ఎంతవరకు తగ్గించుకోగలిగితే అంతవరకు ఇతరులకు సహాయ సహకారములు అందుతూ ఉంటాయి. మనం కోరికలలోనుండి విడుదలపొందితే ఇతరులకు సహాయం చెయ్యవచ్చు. మనమే కోరికల తో బాధపడుతూ ఉంటే ఇంక ఇతరులకు మనం ఏమి సహకారం చేయగలము. ఎంత ఉన్నా మన పొట్టకే సరిపోతూఉంటే ఇంక ఇతరులకు ఏమి ఇవ్వగలము. మనస్సును విడిచి పెడితే క్రోధం లేదు, కోపం లేదు, కోరిక లేదు, మాయ అంతా మనస్సులోనే ఉంది. మనస్సుకు వేరుగా మాయ ఉంది అని అనుకొంటే మనకు సబ్జక్టు సరిగా అర్థం కావటం లేదు అని అర్థం. మీకు అందరికి శాంతి కావాలి, ఆనందం కావాలి, మోక్షం కావాలి. మోక్షం కావాలనుకొనే వాడికి జ్ఞానం సంపాదించాలనే తపన ఉండాలి. ముముక్షత్వం ఉన్నవాడికి మోక్షం వస్తుంది. తపస్సు వలన, నిష్కామకర్మవలన, నిష్కామభక్తి వలన జీవుడు పవిత్రుడు అవుతాడని వేదం చెపుతోంది. వేదం అంటే మహర్షుల అనుభవాలు. వారు జీవితంలో కష్టాలుపడి, తపస్సులు చేసి జ్ఞానాన్ని సంపాదించి మనలను సుఖపెట్టటం కోసం వారి అనుభవాలను మనకు